క్లుప్తంగా

వారాహి శక్తిపీఠంలో ప్రత్యేక పూజలు



వారాహి అలంకరణలో కాళీమాతా

పుత్తూరు: పరమేశ్వర మంగళం గ్రామ సమీపాన నగరి కనంమిట్ట వద్ద వెలసిన దక్షిణ కాళీ వారాహి శక్తిపీఠంలో ఆదివారం ఆమావాస్య ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి కాళీమాతా, వారాహి అలంకరణలతో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ప్రతి అమావాస్య, పౌర్ణమి రోజుల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

గిట్టుబాటు ధర కల్పించండి

శ్రీరంగరాజపురం: కోళ్ల పెంపకం రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోళ్లరైతులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ఆరిమాకులపల్లి గంగమ్మగుడి వద్ద జిల్లాలోని కోళ్లరైతులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు కోళ్ల కంపెనీ వారు గిట్టుబాటు ధర కల్పించడం లేదని, కోళ్ల రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడి, శ్రమ, కష్టం తమది అయితే లాభాలు మాత్రం కంపెనీ వారు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కోళ్ల రైతులు నాగరత్నం, చెంగమ్మనాయుడు, నాగరాజు, లోకనాథరెడ్డి, కిషోర్, గజేంద్రన్, తిరుమలేష్, శశిధర్, కుమార్, ఢిల్లీబాబు, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా భావనారుషీశ్వర స్వామి ఉత్సవాలు



ప్రత్యేక పూజలందుకుంటున్న స్వామివారు

పుత్తూరు: మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో వెలసి ఉండు శ్రీరుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామి దేవస్థానంలో శ్రీభానారుషీశ్వర స్వామి జయంతి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం మూడవ రోజు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం భజన కార్యక్రమం కోలాహలంగా సాగింది. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

అధ్వాన్నంగా మహదేవ మంగళం రోడ్డు

గంగాధర నెల్లూరు: మండలంలోని మహదేవ మంగళం చెరువు కట్ట తారు రోడ్డు ధ్వంసమైంది. దీంతో కంకరరాళ్లు తేలాయి. ఈ రోడ్డులో వెళ్లే వాహన దారుల అవస్థలు వర్ణనాతీతం. మండలంలో చిన్నవేపంజేరి, మహదేవమంగళం, తిరువిధికుప్పం, కడపగుంట పంచాయతీల ప్రజలు రాకపోకలు సాగించాలంటే ప్రధానంగా మహదేవమంగళం చెరువు కట్టపై వెళ్లాల్సిందే. ఈ తారు రోడ్డు ధ్వంసమై గుంతలు ఏర్పడి కంకర తేలింది. చిత్తూరు-తిరువిధికుప్పం ఆర్టీసీ బస్సు సైతం ఈ దారిలోనే రాకపోకలు సాగిస్తూ ఉండేది. ప్రస్తుతం ఆ బస్సు సర్వీసు నిలిచిపోయింది. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కొత్తగా రోడ్డు వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నాగరాజకుప్పం లేఅవుట్‌లో నివాసాల మధ్య, వీధుల్లో పెరిగిపోయిన ముళ్లకంపలు







ముళ్లపొదల్లో పక్కా గృహాలు

సాధారణంగా ప్రతి ఒక్కరూ సొంతింటి కోసం కలలుగంటుంటారు. ఆర్థిక స్తోమత ఉన్న వారు తమ హోదాకు తగ్గట్టుగా ఇంటిని నిర్మించుకుంటారు. మధ్య తరగతి వారు అప్పోసప్పో చేసి తాహతుకు తగ్గ ఇంటితో సంతృప్తి పడతారు. పేదవారికి మాత్రం సొంతిల్లు అనేది గొప్ప కలే. వారి కల నిజం చేసేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం శాయశక్తులా కృషి చేసింది. పేదలకు సొంత స్థలాన్ని కేటాయించి, ఇంటి నిర్మాణానికి అన్ని విధాలా సహకరించింది. తమ స్వప్నం సాకారమవుతుందని అనుకుంటున్న తరుణంలో, ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు పాలనలో పేదల కలలన్నీ నీరుగారిపోయాయి.

- బూత్ బంగ్లాలను తలపిస్తున్న అసంపూర్ణ గృహాలు
- అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఎక్కడి గొంగళి అక్కడే
- ఆశలు వదులుకుంటున్న లబ్ధిదారులు





నగరి వైట్ హౌస్ వెనుక ముళ్లకంపలతో అధ్వానంగా ఉన్న వీధిలో అసంపూర్ణ నివాసాలు, బూత్‌బంగ్లాను తలపిస్తున్న నివాసం

నగరి: గత పాలనలో జిల్లా వ్యాప్తంగా 73,584 గృహాలు మంజూరయ్యాయి. వీటిలో ఎన్నికలకు మునుపు 45,309 గృహాలు పూర్తయ్యాయి. 273 గృహాలు ప్రారంభించక పోగా మిగిలిన గృహాలు వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయి. వీటికోసం అప్పటి ప్రభుత్వం రూ.936.15 కోట్లు ఖర్చు చేసింది. ఈ నిర్మాణాలు కూటమి పాలన వచ్చాక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఆగిపోయాయి. గృహ నిర్మాణ శాఖ వెబ్‌సైట్ లాక్ అవడంతో వేర్వేరు దశల్లో పూర్తయిన గృహాలకు సంబంధించిన బిల్లులను అప్‌లోడ్ చేసేందుకు వీల్లేకపోవడంతో గృహ నిర్మాణాలకు బ్రేక్ పడింది. దీంతో కొన్ని నెలలు గడిచి పోయాయి. ఆపై వెబ్‌సైట్ లాక్ ఓపెన్ అయినా కూటమి ప్రభుత్వం అంతగా శ్రద్ధ చూపక పోవడంతో దాదాపు ఏడాది కాలం గడిచి పోయింది. లబ్ధిదారులు కూడా చేసేది ఏమీలేక అలాగే వదిలేశారు. దీంతో అసంపూర్ణ నివాసాల చుట్టూ పిచ్చిమొక్కలు, ముళ్లకంపలు ఏపుగా పెరిగి నిర్మాణాలన్నీ బూత్ బంగ్లాల్లా దర్శనమిస్తున్నాయి. పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో వీధులు కూడా కనిపించడం లేదు. అసంపూర్ణ గృహాలకు పెట్టిన కిటికీలకు, తలుపులకు చెదలు, తుప్పు పట్టాయి. నగరి మున్సిపాలిటీలోని లబ్ధిదారులకు నాగరాజకుప్పం మార్గంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ ఈ దీనస్థితికి అద్దం పడుతోంది. నగరి నియోజకవర్గంలో 5,195 ఇళ్లు కేటాయించగా వాటిలో 4,942 నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. వీటిలో 2001 గృహాల నిర్మాణం పూర్తయింది. నియోజకవర్గంలోనే నగరి మున్సిపాలిటీకి నాగరాజకుప్పంలో ఏర్పాటుచేసిన లేఅవుట్ అతి పెద్ద లేఅవుట్‌గా నిలిచింది. ఈ ప్రాంతంలో 1300 మంది లబ్ధిదారులకు నివాసాలు కేటాయించారు. కాంట్రాక్టు పద్ధతిలో వేగంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. అయితే అధికారం మారాక పడకేశాయి. అసంపూర్ణంగా నిలిచిన ఇళ్లు నేడు లబ్ధిదారులు చూసి భయపడే స్థితిలో మారిపోయాయి. నిర్మాణాలన్నీ శిథిలావస్థలో పిచ్చిమొక్కల మధ్య దర్శనమిస్తోంది.

నిర్మాణ వ్యయం పెరిగింది



నాగరాజకుప్పం మార్గంలో వేసిన లేఅవుట్‌లో నాకు ఇంటి స్థలం మంజూరు చేశారు. ఇంటి నిర్మాణం ఓ మేరకు పూర్తి చేశా. ప్రస్తుతం చాలా నిర్మాణాలు నిలిచిపోయాయి. ఏడాది కాలంగా అక్కడ ఏ పనులు జరగలేదు. వీధులు కనిపించనంతగా ముళ్లపొదలు పెరిగిపోయాయి. ప్రస్తుతం నిర్మాణ సామగ్రి ధర పెరిగింది. దీంతో నిర్మాణాలన్నీ వదిలిపెట్టేశాం. అదనపు డబ్బులు వస్తే కొంత మేరకు ఉపయోగపడుతుంది.

– రాజేశ్వరి, కొత్తపేట

అదనపు డబ్బులు మంజూరు చేస్తున్నాం



అసంపూర్ణంగా ఆగిన గృహాలు పూర్తిచేసేందుకు ప్రత్యేక పథక రచన చేశాం. అసంపూర్ణ నివాసాలు కలిగిన వారు బీసీ, ఎస్సీలు అయితే రూ.50 వేలు, ఎస్టీలు అయితే రూ.75వేలు ప్రభుత్వ ఆదేశాల మేరకు అదనంగా మంజూరు చేస్తున్నాం. లబ్ధిదారులకు ఒక సమావేశం పెట్టి అదనపు మంజూరుపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. లబ్ధిదారుల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయిస్తాం.

–శంకరప్ప, డీఈ, గృహనిర్మాణ శాఖ, నగరి

అదనంగా డబ్బులు చెల్లిస్తాం

అసంపూర్ణ నిర్మాణాలను పూర్తి చేసేందుకు ఏడాది తరువాత గృహనిర్మాణ శాఖ ప్రయత్నాలు చేస్తోంది. అసంపూర్ణంగా ఉన్న గృహాలు బీసీ, ఎస్సీలకు చెందినవి అయితే గతంలో ఇచ్చిన రూ.1.80 లక్షలు కాకుండా అదనంగా రూ.50 వేలు, గృహ నిర్మాణాలు చేపట్టేవారు ఎస్టీలు అయితే అదనంగా రూ.75 వేలు అందిస్తామని అధికారులు చెబుతున్నారు.

ఏటీఎం ఏర్పాటు చేయండి

నింద్ర: మండల కేంద్రంలో ఏటీఎం ఏర్పాటు చేయాలని స్థానికులు తెలిపారు. మండలంలో ప్రజలకు వివిధ బ్యాంకుల్లోని ఖాతాలు ఉన్నాయి. కానీ ఏటీఎం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మండలవాసులు నగరి, పిచ్చాటూరు తదితర గ్రామాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి మండల కేంద్రంలో ఎస్‌బీఐ, యానియన్ బ్యాంకు వారు ఏటీఎం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఏఐఏవై నూతన కార్యవర్గం ఎంపిక



నాగరాజు



మస్తాన్

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలం ఆలిండియా అంబేడ్కర్ యువజన (ఏఐఏవై) సంఘం నూతన కార్యవర్గం ఎంపిక ఆదివారం జిల్లా అడ్వైజర్ డాక్టర్ డేవిడ్ అధ్యక్షతన నిర్వహించారు. గౌరవ అధ్యక్షులు లోకనాథం, అధ్యక్షుడు నాగరాజు, కారదర్శి మస్తాన్, కోశాధికారి గణేష్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఐఏవై మండల సభ్యులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి అమ్మవారికి పూజలు

నింద్ర: మండలంలోని కేఆర్ పాళెం గ్రామంలో ఉన్న మహాలక్ష్మి అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఆలయంలో భజనలు చేశారు.

సచివాలయ కార్యదర్శికి డాక్టరేట్



తేజస్వి

నగరి: పట్టణంలోని బాలాజీ గోల్డెన్ సిటీలో కాపురమున్న జి.తేజస్వి పుత్తూరు మండలం పరమేశ్వర మంగళం సచివాలయ కార్యదర్శిగా సేవలందిస్తున్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో లోడ్ బ్యాలెన్సింగ్ ఇన్ క్లౌడ్ కంప్యూటింగ్ యూసింగ్ హైబ్రిడ్ అప్రోచ్ అనే అంశంపై విశేష పరిశోధనలు నిర్వహించిన తేజస్వి కుప్పం ద్రావిడియన్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. తన పరిశోధన ప్రయాణంలో ఆయన 15 అంతర్జాతీయ, జాతీయ జర్నల్స్‌లో వ్యాసాలు ప్రచురించగా, 34 సదస్సుల్లో పాల్గొన్నారు. సచివాలయ కార్యదర్శిగా ఉన్న విద్యపట్ల చూపిన నిబద్ధత అభినందనీయమని పలువురు ప్రశంసించారు.

వైఎస్సార్ సీపీ బలోపేతమే లక్ష్యం



జీడీనెల్లూరు ఇన్‌చార్జ్ కృపాలక్ష్మిని మర్యాద పూర్వకంగా కలసిన కార్వేటినగరం నాయకులు

కార్వేటినగరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కలసి పని చేయాలని గంగాధర నెల్లూరు ఇన్‌చార్జ్ కళత్తూరు కృపాలక్ష్మి అన్నారు. కార్వేటినగరం మండల నాయకులు ఆదివారం సమన్వయకర్త కృపాలక్ష్మిని విజయవాడలోని ఆమె స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇక నుంచి జరిగే ప్రతి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ పని చేసి గెలుపు జెండా ఎగుర వేద్దామని పిలుపునిచ్చారు. మరోమారు జగనన్న ముఖ్యమంత్రి అయితే రాష్ట్రప్రజలకు మంచి జరుగుతుందన్నారు. అందుకోసం ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, కార్వేటినగరం సర్పంచ్ ధనంజయవర్మ, జేసీఎస్ కన్వీనర్ పురంధర్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు పట్టాభిరెడ్డి, ఉప సర్పంచ్ శేషాద్రి, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేద్దాం



నందగోపాల్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కార్వేటినగరం: గ్రామస్థాయి నుంచే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దామని కొల్లాగుంట ఎంపీటీసీ శ్రీనివాసులురెడ్డి అన్నారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శిగా నియమితులైన నందగోపాల్‌ను గ్రామంలోని నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో, వచ్చే ఎన్నికల్లో విజయం సాధించేందుకు గ్రామస్థాయి నుంచే పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం మండల కార్యదర్శి నందగోపాల్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ పదవీ బాధ్యతలను అప్పగించిన మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామికి, నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మికి ఎప్పటికీ రుణపడి ఉంటానని తెలిపారు. అలాగే పదవి రావడానికి కృషి చేసిన మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మునికృష్ణ, సర్పంచ్ దివ్యగాంధీ, నాయకులు బాబ్జిరెడ్డి, గోవిందన్, లవకుమార్, యోగేంద్రన్(లడ్డు), సోము, ఉదయ్, రవి, మురగయ్యశెట్టి, యువరాజు, మురగేశన్ మేస్త్రి, మాయకృష్ణ, జయవేలు, వెంకటేశులు, నటరాజన్, క్రిష్ణయ్య పలువురు పాల్గొన్నారు.

శరవేగంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ



లైట్లు వేసుకుని మరమ్మతు చేస్తున్న అధికారులు

వెదురుకుప్పం: మండలంలోని చెంచుగుడి గ్రామ సమీపంలో శనివారం సాయంత్రం 220 కేవీ విద్యుత్ వైరు తెగిపోవడంతో విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. సంఘటన తెలిసిన వెంటనే విద్యుత్ శాఖ డీఈ ఆధ్వర్యంలో మరమ్మతు పనులు చేపట్టారు. మామిడి తోటపై పడడంతో రైతుల తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో రాత్రి 11 గంటల వరకు మరమ్మతు పనులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు ఏఈ తెలిపారు. విద్యుత్ వైరు సరిచేసే క్రమంలో మామిడి చెట్లు ధ్వంసం కాకుండా సిబ్బంది జాగ్రత్తలు తీసుకున్నారని చెప్పారు. విద్యుత్ సరఫరాను నిలిపివేసి లైట్లు వేసుకుని పనులను శరవేగంగా పూర్తి చేశామన్నారు.

సుబ్రమణ్యంరెడ్డి సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న యువజన సేవా సభ్యులు

వడమాలపేట (విజయపురం): రేణిగుంట మండలం తండ్లం గ్రామానికి చెందిన సుబ్రమణ్యం రెడ్డి సేవలు మరువలేనివని నెహ్రూ యువజన సేవా సంఘ అధ్యక్షురాలు జ్యోతి లక్ష్మి అన్నారు.ఎస్వీపురం గ్రామంలో ఆదివారం స్వర్గీయ సేవా భారతి అధ్యక్షుడు సుబ్రమణ్యం రెడ్డి సంతాప సభ నిర్వహించారు. పలువురు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నెహ్రూ యువజన సేవ వ్యవస్థాపకుడు వెంకమరాజు మాట్లాడుతూ సుబ్రమణ్యంరెడ్డి మూడు దశాబ్దాలుగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ఆయన కుమారుడు నరేంద్రకుమార్ మాట్లాడుతూ తండ్రి ఆశయ సాధనకు తమ వంతు కృషి చేస్తానని అన్నారు. అనంతరం మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మురళి, లోకేష్, నాదముని, చంద్రశేఖర్ రాజు, మీరయ్య, నాగభూషణం రాజు, చంద్రశేఖర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, కిషోర్ పాల్గొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఏఎస్‌ఐ రవి

పాలసముద్రం: వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని ఏఎస్ఐ రవి తెలిపారు. ఆదివారం చిత్తూరు– బలిజకండ్రిగ జాతీయ వాహనాలు తనిఖీ నిర్వహించారు. వాహనదారులతో ఏఎస్ఐ రవి మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ క్షేమంగా గమ్యస్థానాలు చేరుకోవాలంటే రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. ఓవర్ స్పీడ్ వెళ్లడంతో పాటు మాస్క్, హెల్మెట్, సీటు బెల్టు పెట్టుకోకుండా చాలామంది రోడ్డుపై వాహనాలు నడపుతున్నారని అన్నారు. మద్యం తాగకుండా వాహనాలు నడపాలని సూచించారు. ముఖ్యంగా వాహనాలకు రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ తప్పక ఉండాలన్నారు. ఇందులో ఏది లేకపోయినా జరిమానా తప్పదని హెచ్చరించారు. రికార్డులు లేని వాహనాలకు జరిమానా వేశారు.

బీరువా వితరణ



దాత ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయతీ మొరవ గ్రామంలో ఉన్న శ్రీకృష్ణ సమేత ద్రౌపదీ ధర్మరాజుల ఆలయానికి పచ్చికాపల్లంలోని శ్రీ లక్ష్మీ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ అధినేత ప్రసాద్ బీరువాను వితరణ చేశారు. రూ.10 వేలు విలువ చేసే బీరువాను అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా దాత ప్రసాద్‌ను ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. అంతకుముందు ఆయన ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఆకట్టుకున్న బండికుంభాలు



బలికూడుతో ప్రదర్శనగా వెళ్తున్న బకాసురుడు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో మహాభారత ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం బండి కుంభాల కార్యక్రమం ఆకట్టుకుంది. ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భాగవతారిణి హరికథా గానం చేశారు. సాయంత్రం బలికూడుతో బకాసురుడి వేషధారి ప్రదర్శనగా వెళ్లి ప్రసాదాలను అమ్మవారికి సమర్పించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధికంగా వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారం రాత్రి ఆలయంలో పల్లకీ సేవ నిర్వహించారు. అమ్మవారిని తిరుమాడ వీధుల్లో వైభవంగా ఊరేగించారు. పల్లకిసేవ ఉత్సవానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్రకార్యదర్శి పేట ధనుంజయరెడ్డి, నల్లవెంగనపల్లె ఎంపీటీసీ సభ్యురాలు సుజాత, డీపీఎం హరికృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. సోమవారం అమ్మవారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అలరించిన దుర్యోధన వధ



యుద్ధంలో తలపడుతున్న భీమ, దుర్యోధన పాత్రధారులు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

వెదురుకుప్పం: మండలంలోని మొరవ గ్రామంలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో గత 10 రోజులుగా జరుగుతున్న మహాభారత ఉత్సవాలు ఆదివారం దుర్యోధన వధ ఘట్టంతో ముగిసింది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. తదుపరి భాగవతారిణి మధులత హరికథా కాలక్షేపం చేశారు. అనంతరం మధ్యాహ్నం దుర్యోధన వధ ఘట్టాన్ని కళాకారులు రక్తికట్టించారు. దుర్యోధనుడు గంగమడుగులో దాక్కుని ఉండగా.. భీమసేనుడు బయటకు లాక్కొచ్చి చేసే యుద్ధ సన్నివేశం ఆహుతులను అలరించింది. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్యోధనుడి ప్రతిమ వద్ద సాగిన భీమ, దుర్యోధన వేషధారుల భీకరపోరు భక్తులను కట్టిపడేసింది. ఇద్దరి మధ్య వీరోచితంగా సాగిన పోరులో దుర్యోధనుడు తనువు చాలించాడు. కళాకారుల నాటక ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంది. అనంతరం ధర్మరాజుల పట్టాభిషేకం జరిగింది. సాయంత్రం అమ్మవారి అగ్నిగుండ ప్రవేశాన్ని భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల భక్తులు కంకణధారులై ఉపవాసాలతో అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు తీర్చుకున్నారు. మొరవ గ్రామంలో ద్రౌపదీ దేవి అమ్మవారి ఆలయంలో సాగిన మహాభారత ఉత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యుత్ దీపాల అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవాలను నిర్వాహకులు బోడిరెడ్డి మోహన్‌రెడ్డి, తారక్ రెడ్డి పర్యవేక్షించారు.

బైక్‌ను ఢీకొట్టిన బొలెరో

శ్రీరంగరాజపురం: ద్విచక్ర వాహనదారుడిని బొలెరో వాహనం ఢీకొట్టడంతో పాటు రోడ్డుపై ఈడ్చుకుంటూ వెళ్లడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన వెలుగు చూసింది. స్థానికుల కథనం మేరకు ఆదివారం మండలంలోని 49 కొత్తపల్లి సచివాలయం వద్ద గంగాధరనెల్లూరు మండలం నెల్లేపల్లికి చెందిన సింగారం కుమారుడు రామయ్య సంతలో కూరగాయలు తీసుకుని స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. అయితే చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిలోని 49 కొత్తపల్లి సచివాలయం వద్ద చిత్తూరుకు వెళ్తున్న బొలెరో వాహనం వెనుక వైపు నుంచి రామయ్య ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఆపై ఆ బైక్‌ను రోడ్డుపై ఈడ్చుకుంటూ వెళ్లడంతో రామయ్యకు తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు 108 వాహనం ద్వారా క్షతగాత్రున్ని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

డంపింగ్ యార్డుకు నిప్పు



చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరం లెనిన్ నగర్‌లోని డంపింగ్ యార్డుకు నిప్పు అంటుకుంది. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. మంటలను అదుపులోకి తీసుకున్నారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.